క్లుప్తంగా

ఆరు కేంద్రాల్లో గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌ పరీక్ష

పాల్వంచరూరల్‌: ఖాళీ పోస్టుల భర్తీ కోసం నేడు జరగనున్న గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ పరీక్ష నిర్వహణకు పాల్వంచలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్‌ వివేక్‌ శనివారం తెలిపారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నవభారత్‌ స్కూల్‌, సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల, కేటీపీఎస్‌ కాలనీలోని డీఏవీ స్కూల్‌, బస్వతారక కాలనీ సమీపంలోని కేఎల్‌ఆర్‌ ఇంజనీరింగ్‌ కళాశాల, కాంట్రాక్టర్‌ కాలనీలోని కేఎల్‌ఆర్‌ ఫార్మసీ కళాశాలల్లో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షకు 2,852 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

నేడు ఇఫ్టూ జిల్లా మహాసభ



మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ అనుబంధ ఇఫ్టూ జిల్లా మహాసభ ఆదివారం ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌షావలీ తెలిపారు. శనివారం ఇల్లెందులో గత మహాసభ నుంచి నేటివరకు జరిగిన పోరాటాలను సమీక్షించుకుని రాబోవు కాలానికి నిర్వహించబోవు సమరశీల పోరాటాల కర్తవ్యాలను రూపొందించుకునేందుకు ఈ మహాసభలలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలలో వక్తలు గుమ్మడి నర్సయ్య, ఇఫ్టూ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామయ్య, యాకుబ్‌షావలీ, పాయం వెంకన్న, ఇల్లెందు డివిజన్‌ కార్యదర్శి ఈసం శంకర్‌ పాల్గొంటారని తెలిపారు. పాయం వెంకన్న, బొల్లి రవి, సంపత్‌, బాజ్యా, శ్రీను పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌

ఇల్లెందురూరల్‌: బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎంఈఓ పిల్లి శ్రీనివాస్‌ కోరారు. మండలలలోని రాఘబోయినగూడెం గ్రామపంచాయతీలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీలోని పలు గ్రామాలలో పర్యటించి గ్రామపెద్దలతో ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల భౌతిక స్వరూపం, పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా సహకరించాలని కోరారు.

'ప్రైవేట్‌'కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కొత్తగూడెంరూరల్‌: ప్రైవేట్‌ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని కౌన్సిలర్‌ మాచర్ల రాజకుమారి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం స్కూల్‌ హెచ్‌ఎం జరీనాతో కలిసి కౌన్సిలర్‌ పరిశీలించారు. ప్రైవేట్‌ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్‌ స్థాయి విద్యను అందించడం కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా చూడాలని కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- రోడ్డు పక్కన ఉన్నా రక్షణ చర్యలేవి?
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు
- మూగజీవాలకు పొంచి ఉన్న ప్రమాదం

పాల్వంచరూరల్‌: వచ్చేది వానాకాలం ఈ క్రమంలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అయినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని పెద్దమ్మగుడి వద్ద బీసీఎం జాతీయ రహదారి పక్కన నెలకొల్పిన ట్రాన్స్‌ఫార్మర్‌, యానంబైల్‌ గ్రామం, చంద్రాలగూడెం వద్ద ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు మూగజీవాలకు, ప్రజలకు ప్రమాదకరంగా మారాయి. పెద్దమ్మగుడి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ దిమ్మను తక్కువ ఎత్తులో నిర్మించారు. ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. నిత్యం భక్తుల రద్దీ, వాహనాల రద్దీ అధికంగా ఉండే జాతీయ రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు పొరపాటున ఏదైనా వాహనం తగిలినా, మనుషులు తగిలినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అదే విధంగా యానంబైల్‌ గ్రామం వద్ద ఉల్వనూరు వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రమాదకరంగా ఉంది.

అయినా ఎలాంటి రక్షణ లేదు. చంద్రాలగూడెంలో సింగిల్‌ఫేస్‌ విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రధాన రహదారి పక్కన విద్యుత్‌ పోల్‌పై తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. దీనివల్ల కూడా ప్రమాదకర పరిస్థితి ఉంది. పాండురంగాపురంలో వైఎస్సార్‌ విగ్రహం ఎదుట స్కూల్‌కు వెళ్లే రహదారి పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ తక్కువ ఎత్తులో ఉండడంతో గతంలో విద్యుదాఘాతంతో గేదెలు మృతి చెందాయి. అదేవిధంగా బిక్కు తండా వద్ద నెలరోజుల క్రితం విద్యుత్‌ వైర్లు కిందకు వెలాడుతూ.. గాలికి తెగిపడి మేతకు వెళ్లిన మూడు పశువులు మృత్యువాత పడ్డాయి. కిన్నెరసాని రోడ్డులో బంజరకాలనీ వద్ద రోడ్డు పక్కన విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి రెండు గేదెలు మరణించాయి. పాండురంగాపురంలో మరో రెండు గేదెలు మరణించిన సంఘటనలు ఉన్నాయి.


చంద్రాలగూడెంలో ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌


పెద్దమ్మగుడి వద్ద రక్షణ లేకుండా..

రక్షణ చర్యలు తీసుకోవాలి...

విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రతీ సంవత్సరం మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రధానంగా వేసవికాలంలో పశువులు, గేదెలు ఎక్కడ పడితే అక్కడ మేతకు వెళ్లిన క్రమంలో ఎత్తు తక్కువగా నిర్మాణం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.

రక్షణ చర్యలు తీసుకోవాలి...

నిత్యం జనాలు, మూగజీవాలు సంచరించే ప్రాంతాల్లో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. పాండురంగాపురంలో స్కూల్‌కు వెళ్లే దారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రమాదకరంగా ఉందని పలుమార్లు సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు.

– హనుమంతరావు, పాండురంగాపురం

ఏర్పాట్లు చేస్తాం..

మండలంలో రోడ్డు పక్కన ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో దిమ్మెలు నిర్మాణం చేసి ఉన్నాయి. వాటి ఎత్తు పెంచి రక్షణ చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రమాదకరంగా ఉన్న మూడు ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు ఏర్పాటు చేయడం జరిగింది. చంద్రాలగూడెం, యానంబైల్‌ వద్ద ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా రక్షణ చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌, ఎన్‌పీడీసీఎల్‌ రూరల్‌ ఏఈ

రాజీపడడమే రాజమార్గం


లోక్‌ అదాలత్‌ నిర్వహిస్తున్న కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు: ఇరువర్గాలు కోర్టు సమక్షంలో రాజీపడితే ఇరువురు గెలిచినట్లేనని, ఒకసారి లోక్‌ అదాలత్‌లో రాజీపడితే పైకోర్టుకు అప్పీల్‌ చేసుకునే అవకాశం లేదని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. శనివారం ఇల్లెందు కోర్టులో లోక్‌ అదాలత్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కక్షిదారులు సమయం, డబ్బు వృథా చేసుకోవటం కంటే ఇరువర్గాలు నష్టపోకుండా కోర్టు సమక్షంలో రాజీపడితే ఎంతో ఉపయోగం అన్నారు. ప్రజా పంచాయతీలో రాయించుకున్న అగ్రిమెంట్లు కోర్టులో చెల్లుబాటు కాదని, అలాంటి అగ్రిమెంట్లకు చట్టబద్ధత ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్‌ అధ్యక్షుడు రవినాయక్‌, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తీక్‌, నవీన్‌కుమార్‌, సీనియర్‌ న్యాయవాదులు చెన్నకేశవరావు, తుమ్మలపల్లి ప్రభాకర్‌రావు, దంతాల ఆనంద్‌, పి.బాలకృష్ణ, పప్పుల గోపీనాథ్‌, ఎండీ ఖాసీం, పైలా జయప్రకాష్‌ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత


కేటీకేలో ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం, ఉద్యోగులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ ఆనంద్‌ తెలిపారు. ఈ మేరకు శనివారం కార్పొరేట్‌ జీఎం సేఫ్టీ గురవయ్య ఇచ్చిన ఆదేశాల మేరకు కోయగుడెం ఉపరితల గనిలో ఉద్యోగులకు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జీఎం మాట్లాడుతూ.. ఫాటల్‌ ఫ్రీ జూన్‌కి అందరూ సహకరించాలన్నారు. గతంలో ప్రతీ సంవత్సరం జూన్‌లో ప్రమాదాలు జరుగుతుండేదని గత సంవత్సరం సింగరేణి వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలతో ఎటువంటి ప్రమాదాలు లేని జూన్‌ నెలను సాధించగలిగామన్నారు. ఈ సంవత్సరం కూడా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. నా రక్షణ.. నా బాధ్యత.. నా కుటుంబ రక్షణ అనే నినాదం చేస్తూ ప్రతీ కార్మికుడు పది రక్షణ సూత్రాలను తప్పక గుర్తు చేసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ వి.శ్రీనివాస్‌, సేఫ్టీ ఆఫీసర్‌ రాజు, నజీర్‌ అహ్మద్‌, సూర్యనారాయణ రాజు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న పిడమర్తి రవి

పాల్వంచరూరల్‌: జనాభా ప్రకారం మాదిగలకు 12శాతం రిజర్వేషన్‌ కల్పించే విధంగా కేంద్రం ఉత్తర్వులు జారీ చేయాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్‌ పిడమర్తి రవి కేంద్రాన్ని డిమాండ్‌ చేశారు. నాగారం గ్రామంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్‌ అధ్యక్షతన శనివారం జరిగిన మాదిగ జనసభలో పిడమర్తి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నూతనంగా ఏర్పాటు కానున్న బీజేపీ ప్రభుత్వం వర్గీకరణపై జాప్యం చేయకుండా అమలు చేయాలని, వర్గీకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేసుకునే విధంగా కేంద్రం గెజిట్‌ నోటీసు జారీ చేయాలని డిమాండ్‌ చేశారు. కులగణన చేపట్టి బీసీలకు 50శాతం, మాదిగలకు 12శాతం, ఎస్టీలకు 10శాతం మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఎంపీలను తిరిగనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమలో మోదుగు జోగారావు, ఒక్కలగడ్డ చంద్రశేఖర్‌, తిరుమలరావు, జున్ను రవి, కుంపటి శివ, కిన్నెర లక్ష్మణ్‌, వేల్పుల జోషి, రవికుమార్‌, సాయి, వెంకటేష్‌, అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

బడి ప్రారంభం నాటికి యూనిఫాం సిద్ధం


కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధన్‌సింగ్‌

ఇల్లెందురూరల్‌: పాఠశాలలు ప్రారంభం నాటికి యూనిఫాం పంపిణీకి సిద్ధంగా ఉంటాయని ఎంపీడీఓ ధన్‌సింగ్‌ తెలిపారు. మండలంలోని పలు కుట్టు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని 84 పాఠశాలలకు సంబంధించి 2,738 మంది విద్యార్థులకు యూనిఫాం దుస్తులు కుట్టే బాధ్యతను పొదుపు సంఘాల మహిళలకు అప్పగించామని చెప్పారు.

ఇప్పటి వరకు 2,559 మందికి యూనిఫాం కుట్టడం పూర్తయిందని, మిగిలినవి కూడా 11వ తేదీ నాటికి పూర్తి చేసేలా పొదుపు సంఘాల మహిళలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు కూడా వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. బడిబాట కార్యక్రమం సత్ఫలితాలనిచ్చే విధంగా సాగుతోందని, ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్‌, సెర్ప్‌ ఏపీఎం దుర్గారావు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి


మాట్లాడుతున్న కామేష్‌

కొత్తగూడెంఅర్బన్‌: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బహుజన సమాజ్‌ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యర్రా కామేష్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్‌ సభలో హామీ ఇచ్చిందన్నారు.

విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీ రిజర్వేషన్లను 29 శాతం నుంచి 50 శాతానికి పెంచుతామని కాంగ్రెస్‌ నాయకులు హామీ ఇచ్చినట్లు చెప్పారు. కానీ ప్రభుత్వం కులగణన అంశాన్ని, రిజర్వేషన్‌ పెంపును పరిగణనలోకి తీసుకోకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించాలని చూస్తోందని ఆరోపించారు.

బీసీలంతా పార్టీలకు, కులాలకు అతీతంగా బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో వంగా రవిశంకర్‌, సందేల సందీప్‌, తాటిపాముల హరికృష్ణ, సమీర్‌, మురళి తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతిపై సంతాపం

కొత్తగూడెంఅర్బన్‌/పాల్వంచరూరల్‌: ఈనాడు పత్రిక, రామోజీ గ్రూప్‌ సంస్థల అధినేత రామోజీరావు మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు కాంగ్రెస్‌ మైనార్టీ సెల్‌ నాయకుడు నయీమ్‌ ఖురేషి శనివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. అలాగే, రామోజీరావు మృతి తీరని లోటని టీజేఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్హోజి శ్రీనివాస్‌, షఫీ తెలిపారు. వీరితో పాటు రవి, నర్సింహారావు, యూనియన్‌ సభ్యులు సంతాపం ప్రకటించారు. అలాగే, డీసీఎంఎస్‌ చైర్మన్‌ కొత్వాల శ్రీనివాసరావుతో పాటు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, బద్ది కిషోర్‌, అయిత గంగాధర్‌, ఎడవల్లి కృష్ణ, ఎస్‌.ఏ.జలీల్‌, రాజమల్లు, దొప్పలపూడి సురేష్‌, చింత నాగరాజు తదితరులు కూడా రామోజీరావుపై మృతిపై వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు: పాపకొల్లు–జడలచింత గ్రామాల మధ్య శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. పాపకొల్లు గ్రామానికి చెందిన పెద్దమళ్ల ప్రసాద్‌ బైక్‌పై జూలూరుపాడు వెళ్తుండగా, జడలచింతకు చెందిన బొప్పిరెడ్డి వంశీ బైక్‌పై పాపకొల్లు వస్తున్నాడు. ఈ క్రమంలో జడలచింత సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా, వంశీకి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

అటవీ భూమిపై ఆక్రమణ వివాదం

ఇల్లెందురూరల్‌: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ శివారులోని అటవీ భూమిలో శనివారం ఇరువర్గాల మధ్య భూఆక్రమణ వివాదం జరిగింది. కొత్తకాలనీకి చెందిన ఎర్రం వీరస్వామి 4.18 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసుకుంటున్నాడు. ఆరోగ్య కారణాల రీత్యా కొంతకాలంగా సాగు చేయడం లేదు. ప్రస్తుతం బీడుగా ఉన్న ఆ భూమిలో రెండు ఎకరాల మేరకు కారేపల్లి మండలానికి చెందిన అశోక్‌ ఆక్రమించుకున్నాడని వీరస్వామి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ బీట్‌ అధికారి కళ్యాణ్‌ అక్కడకు చేరుకొని భూమి యాజమాన్య హక్కు పత్రాలు కలిగి ఉంటే అటవీశాఖ కార్యాలయానికి తీసుకొచ్చి ఉన్నతాధికారులకు చూపించాలని, లేనిపక్షంలో భూమిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా ఈ విషయమై ఎఫ్‌డీఓ కర్నావత్‌ వెంకన్నను వివరణ కోరగా... సోమవారం భూమి హక్కు పత్రాలను పరిశీలిస్తామని, లేనిపక్షంలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతామని చెప్పారు.

భారీ వర్షం


చుంచుపల్లి: ప్రధాన రహదారిపై వరద నీరు


పాల్వంచ: మెయిన్‌ రోడ్డు వద్ద వర్షం

చుంచుపల్లి: జిల్లా కేంద్రం కొత్తగూడేనికి సమీపంలో ఉన్న విద్యానగర్‌ ప్రధాన రహదారి పైన చెరువును తలపిస్తూ వరద పారింది. శనివారం కొద్దిసేపు కురిసిన వర్షానికి ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరింది. మోకాళ్ల లోతు వర్షపు నీరు రహదారిపై చేరడంతో వాహనదారులతో పాటు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. ప్రతీ వర్షాకాలం సీజన్‌లో ఈ రహదారిపై భారీ ఎత్తున నీరు చేరడం పరిపాటిగా మారతోంది. అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో మళ్లీ అదే తంతుగా మారింది.

పాల్వంచ: పాల్వంచలో శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండగా మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు జరిగి వర్షం పడింది. దీంతో పట్టణంలోని పలు దుకాణాలపై ఉన్న బోర్డులు నేలకూలాయి. మృగశిర కార్తె నాడు భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా 'కాంప్లెక్స్‌'

- మున్సిపాలిటీ కాంప్లెక్స్‌లపై ఆసక్తి చూపని వ్యాపారులు
- లలిత కళామందిర్‌ రోడ్‌లో అందుబాటులో 16 గదులు
- నిధులు లేక అసంపూర్తిగా మరో 16 గదులు
- ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ


ఖాళీగా ఉన్న లలిత కళామందిర్‌ రోడ్‌లోని మున్సిపాలిటీ షాపింగ్‌ కాంప్లెక్స్‌

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డున నిర్మించిన షాపింగ్‌ కాంప్లెక్స్‌లు మందుబాబులకు అడ్డాగా మారాయి. ప్రారంభోత్సవం జరిగినా ఏళ్ల తరబడి కేటాయింపు జరగడం లేదు. దీంతో మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతోంది. అయితే మున్సిపాలిటీలో చర్చించి రిజర్వేషన్‌ ప్రకారం కాంప్లెక్స్‌లు కేటాయించాల్సి ఉంది. దీనికోసం పలుమార్లు టెండర్లు నిర్వహించినా లబ్ధిదారులు ముందుకు రావటం లేదు. లలిత కళామందిర్‌రోడ్‌లో రెండేళ్ల క్రితం సుమారు రూ.1.50 లక్షలతో 32 గదుల నిర్మాణం చేపట్టారు. కింద 16 గదులు పైఅంతస్తులో మరో 16 గదుల నిర్మాణం చేపట్టినప్పటికీ అతి కష్టం మీద కింద నిర్మాణం పూర్తి చేశారు. నిధులు లేక పైఅంతస్తు అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల నిధులు కేటాయించినప్పటికీ టెండర్‌ ప్రక్రియ దశలోనే ఉంది. గడిచిన ఆగస్టు 28న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అయితే ఈ గదులు ఇంకా ఎవరికీ కేటాయించలేదు. పలు దఫాలు టెండర్లు నిర్వహించినా ఎవరూ ముందుకు రావటం లేదు. దీంతో మున్సిపాలిటీకి ఆదాయం రాకుండా పోతోంది. ఎంతోమంది రోడ్డు మీద చిరు వ్యాపారాలు చేసుకుని జీవించేవారు ఇలాంటి షాపింగ్‌ కాంప్లెక్స్‌ల మీద ఆశలు పెంచుకున్నారు. కానీ వాటి కేటాయింపునకు ఏర్పాటు చేసిన నియమాలు ఆటంకంగా మారటంతో ఎవరూ ముందుకు రావటం లేదు. తక్కువ కిరాయికి గదులు దొరికితేనే చిరువ్యాపారులు తీసుకునే చాన్స్‌ ఉంది.

పాత గదుల కేటాయింపులో జాప్యం..

ఇదిలా ఉండగా పాత బస్టాండ్‌లో పోస్టాఫీస్‌కు ఇరువైపులా షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణం చేశారు. ఒక వైపు ఆరు గదులు పూల దుకాణాలకు కేటాయించారు. వీటికి ఒక్కో గదికి రూ. 2 వేలు కిరాయి, మరోవైపు గదులు అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేశారు. దీంతో అక్కడి గదులకు కిరాయి రావటం లేదు. ఇక మెయిన్‌ రోడ్‌ హైస్కూల్‌ ఎదురుగా 32 గదులు నిర్మించారు. సగం నిర్మాణం పూర్తి కాగా ఇటీవల ప్రారంభోత్సవం కూడా చేశారు. ఒక్కో గదికి రూ.1500 కిరాయి నిర్ణయించారు. ఇందులో కొన్ని గదులు ఖాళీగా ఉన్నాయి. గోవింద్‌ సెంటర్‌లో 10 గదులు ఉన్నాయి. వాటికి కూడా రూ.1500 కిరాయి నిర్ణయించారు. ఇక మెయిన్‌రోడ్‌ హైస్కూల్‌ ప్రహరీ వెంట సుమారు 20 గదుల నిర్మాణం చేయగా కోర్టు స్టేతో పనులు నిలిచిపోయాయి. అసంపూర్తిగా వదిలేశారు. అయితే వాటి ముందు కొంతమంది రోడ్డు మీద చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇటు మున్సిపాలిటీకి ఆదాయం రాకుండా ఆటు వ్యాపారాలు అభివృద్ధి చేసుకోకుండా పోయింది. మున్సిపాలిటీకి ఆదాయం లభించేలా వేసిన అడుగులన్నీ వెనుకడుగులు అవుతున్నాయి.


తాగి పడేసిన మందుబాటిళ్లు

చెత్తతో నిండిపోయాయి..



పట్టణంలోని లలిత కళామందిర్‌ రోడ్‌లో నిర్మించిన షాపింగ్‌ కాంప్లెక్స్‌ మందు బాబులకు అడ్డాగా మారింది. జగదాంబా సెంటర్‌లోని మందు షాపులో కొనుగోలు చేసి షాపింగ్‌ కాంప్లెక్స్‌ మెట్లమీద కూర్చుని తాగుతున్నారు. మందు బాటిళ్లు అక్కడే వదిలేసి పోతున్నారు. అక్కడ చెత్తచెదారంతో కంపు కొడుతోంది.

– చాంద్‌పాషా, లలిత కళామందిర్‌ ఏరియా, ఇల్లెందు

టెండర్‌ నిర్వహించాం..



మున్సిపాలిటీలోని షాపింగ్‌ కాంప్లెక్స్‌లకు పలుమార్లు టెండర్లు నిర్వహించాము. ఎవరూ ముందుకు రావడం లేదు. కిరాయి తగ్గించి కూడా టెండర్‌ పిలిచాము. అయినా విముఖత చూపుతున్నారు. మరోమారు టెండర్‌ ప్రక్రియ చేపడతాము. మందు బాబులు రాకుండా నిఘా, గార్డును ఏర్పాటు చేస్తాం.

– డి.వెంకటేశ్వరరావు, చైర్మన్‌, ఇల్లెందు మున్సిపాలిటీ

జోరుగా చేపల విక్రయాలు

ఇల్లెందు: మృగశిర కార్తె వచ్చిందంటే చాలు చేపలు, చేప మందుకు గిరాకీ ఉంటుంది. ఈసారి శనివారం ఒకవైపు మృగశిర కార్తె, మరుసటి రోజు ఆదివారం రావడంతో చేపలకు డిమాండ్‌ మరింత పెరిగింది. ఇల్లెందు పట్టణంలోని చేపల మార్కెట్‌తో పాటు బుగ్గవాగు బ్రిడ్జి, గోవింద్‌ సెంటర్‌, జేకే కాలనీ ఏరియాలో చేపల విక్రయం జోరుగా సాగింది. సాధారణ రోజుల్లో కిలో చేపలు రూ.150 ధర పలకగా.. మృగశిర కార్తె రోజు రూ.250 వరకు అమ్మారు. ఇదిలా ఉండగా పట్టణంలోని కళాసీబస్తీలో చేప మందు ఇచ్చే వ్యక్తి ఇంటి వద్ద ప్రజలు బారులు దీరారు.

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): శనివారం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో భారీగా చేపల విక్రయాలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి చేపల వ్యాపారులు దిగుమతి చేసుకున్న చేపలను విక్రయించారు. సంత జరిగే ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా చేపల దుకాణాలు వెలిశాయి. రోజు కంటే రూ.50 – 100 ఎక్కువకు అమ్మకాలు చేశారు.

జూలూరుపాడు: మృగశిర కార్తె ప్రారంభం తొలిరోజు శనివారం ప్రజలు చేపల కొనుగోలుకు ఆసక్తి చూపారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన చేపల వ్యాపారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద ప్రజలు బారులు తీరారు. కొత్తూరు, జూలూరుపాడు, పుల్లుడుతండా (భోజ్యాతండా), అన్నారుపాడు, తదితర చెరువుల వద్ద చేపల వేట జరిగింది. ఆయా చెరువుల వద్ద చేపలు ప్రజల కొనుగోలు చేశారు. మృగశిర కార్తె తొలిరోజున చేపల కూర తింటే ఆరోగ్యానికి మంచిదనే నమ్మకంతో ప్రజలు చేపలను కొనుగోలు చేశారు. దీంతో చేపలకు గిరాకీ పెరిగింది. కిలో రూ.160 నుంచి రూ.180 అమ్మారు. చెరువుల వద్ద సహకార సంఘాల ఆధ్వర్యంలో కిలో రూ.130 కావడంతో మధ్యాహ్నం వరకు చేపల కొనుగోళ్లు జోరుగా జరిగాయి.


ఇల్లెందు: రాఘబోయినగూడెం చెరువు వద్ద..


జూలూరుపాడులో కొనుగోలు చేస్తున్న ప్రజలు


సూపర్‌బజార్‌(కొత్తగూడెం): చేపల దుకాణం